

# నక్టామామూ

## మొర్రి మామ

ఒకూళ్లో ఒకామెకి ఏడుగురు కొడుకులు. ఎందరు? ఏడుమంది.

ఏడుమందికీ పెళ్లిళ్లయ్యాయి. ఏడుగురు కోడళ్లూ వచ్చారు. అయితే వాళ్లల్లో ఆరుగురు కోడళ్లు ఉన్నోళ్లు. చిన్నామె లేనిది.

ఉత్త డబ్బే కాకుండా నా అన్న వాళ్లు ఎవ్వరూ లేని ఆ కోడల్ని కేవలం పిల్ల చాలా అందంగా వుంది కదా అని చేసుకొని తెచ్చుకున్నారు.

తెచ్చుకున్నారనే గానీ అత్తకు ఈ కోడలంటే చులకన. పండగలూ, పబ్బాలూ వస్తాయి గదా అప్పుడు ఆరుగురు కోడళ్ల అమ్మా నాన్నలు వచ్చి ఆ కోడళ్లను పుట్టిళ్లకు తీసుకెళ్లి పాకంపూరీలు, లడ్డూలూ, కారాగీరా యిచ్చి పంపుతారు గదా వాటన్నింటినీ చూసినప్పుడు మాత్రం అత్తకు చిన్నకోడలంటే యింకా కోపం వచ్చేసేది.

'చీరా సారె సంగతి పక్కనపెట్టు. ఆఖరకు పుల్లటి పండుని కూడా నీ ముఖాన కొట్టేవాళ్లు ఎవ్వరూ లేకపాయెనే. నీదీ ఒక బతుకేనా? అయినవాళ్ల రైకగుడ్డకు కూడా నోచుకోని బతుకు?' అని దెప్పిదెప్పి పొడిచి చంపేది.

ఆ దెప్పులను సహించి సహించి యింక వల్లగాక ఒకరోజు ఏడ్చుకుంటూ ఏడ్చుకుంటూ వెళ్లి చెరువు గట్టున కూర్చుంది చిన్నకోడలు.

కూర్చుని 'యా ఖుదా. ఏమి నా రాత యిలా రాసిపెట్టావు. అమ్మా నాన్నను ఎలాగూ మిగల్చకపోతివి. తమ్ముడూ చెల్లెలిను లేకుండా చేస్తివి. ఆఖరుకు ఒక వెర్రి మేనమామనో, మొర్రి మేనమామనో అన్నా యివ్వకపోతివి. నాకే గనక ఒక మేనమామ వుండుంటే యివాళ యిన్ని మాటలు పడాల్సి వచ్చేదా? వాడొచ్చి నన్ను పుట్టింటికి తీసుకెళ్లి చీరా సారె పెట్టి పంపుండేవాడు కదా' అని దేవుడికి మొరపెట్టుకొని యింటికి చేరింది.

యింటికి చేరేసరికి దేవుడు ఆమె మొర విన్నాడా అన్నట్టుగా ఒక 'గ్రహణం మొర్రిమామ' వచ్చేసున్నాడు. వాడు చప్పిడి ముక్కుతో, చీలిన పెదాలతో తత్తపొత్త మాటలు మాట్లాడతా గలాటా గలాటా చేస్తున్నాడు.

'ఎక్కలా? మా అమ్మాయి ఎక్కలా? చీల తెచ్చా. సాలె తెచ్చా. మా అమ్మాయికి బలేబలేతివి తెచ్చా. ఎవలూ లేలనుకుంతున్నారా? మా అమ్మాయికి నేనున్నా. మొల్లిమామని. ఖబల్దాల్' అని దబాయిస్తా ఉన్నాడు.

చిన్నకోడలు బిత్తరపోయింది యిది చూసి. వీడెవడబ్బా, వీణ్ణెప్పుడూ నేనూ చూళ్లేదే అనుకుంది.



వాస్తవానికి వాడెవఁడ్రా అంటే చెరువు గట్టున కూర్చుని ఈమె దేవుడికి మొరపెట్టుకుంటా వుంటే విన్న తిక్కల షైతాను. పిల్ల బంగారం లాగ వుండేసరికి మేనమామ అవతారం ఎత్తి పెళ్లి చేసుకుందాం అనుకొని దాపురించాడు. ఈ సంగతి ఎవరికి తెలుసు? ఎవ్వరికీ తెలియదు.

మొఁరిమామ తెచ్చిన కానుకలూ గీనుకలూ అన్నీ చూసి అత్త ఖుష్ ఖుష్ అయిపోయింది. అంతటితో ఆశ తీరక 'ఏనాటి మేనమామో ఈనాడు చూడను వచ్చాడు. వెళ్లమ్మా వెళ్లు. వెళ్లి మీ మేనమామ యింట్లో నాలుగు రోజులు వుండిరా. చీరా సారె తెచ్చుకో పో వెళ్లు' అంది చిన్నకోడలితో.

చిన్నకోడలు అయోమయపడి సరేనని గుఁర్రమెక్కి మొఁరిమామతో బయలుదేరింది.

మొఁరిమామ గుఁర్రాన్ని దౌడు తీయిస్తా, దౌడు తీయిస్తా సగం దారి వెళ్లాక ఒక్క తాపు తన్ని దారి మళ్లించి అడవికి పట్టించాడు.

కోడలికి అనుమానం వచ్చేసింది. అయినా భయం భయంగా 'యిదేంది మామూజాన్. యిటు దారి మళ్లించావు?' అని అడిగింది.

'మామూజాన్‌ని కాదు. మొగులని పిలువు. మొగులని పిలువు' అన్నాడు మొర్రిమామ గుర్రాన్ని దౌడు తీయిస్తా.

చిన్నకోడలి గుండెలు చల్లబడిపోయాయి. అయినా ధైర్యం తెచ్చుకొని కూర్చుంది.

మొర్రిమామ నేరుగా అడవిలో వున్న తన యింటికి తీసుకెళ్లాడు చిన్నకోడలిని. అక్కడ బంగారం, వెండీ, జరీ గిరీ అంతా కుప్పలు కుప్పలుగా పడి వున్నాయి.

'ఈ బంగాలం జలీ అంతా నీకే. పెత్తుకో పెత్తుకో, కత్తుకో కత్తుకో' అన్నాడు మొర్రిమామ.

ఆ తర్వాత 'పదా పెల్లి చేసుకుందాం' అన్నాడు గంతులేస్తా.

అప్పుడు చిన్నకోడలు లోన బితుక్కుమని, పైకి నవ్వి 'మామూజాన్. ఏంది మీరు మాట్లాడేది? ఒక ఆడది ఒక మొగోడు వుంటే పెళ్లి జరిగిపోతుందా? చేసుకోక చేసుకోక చేసుకుంటున్నాం పెళ్లి. ఒక పలావు వండక్కర్లేదా? ఒక తిరగమాత ఉండక్కర్లేదా? మీరు వెళ్లి మాంసం, బియ్యం తీసుకురండి. అన్నీ వండుకుని అంతా సిద్ధం చేసుకుని అప్పుడు చేసుకుందాం పెళ్లి' అంది.

ఆ మాటకి మొర్రిమామ ఎగిరి గంతేశాడు.

'అత్తానే తెత్తాను. అడిగినవన్నీ తెత్తాను' అని రాగాలు తీసుకుంటా గుర్రమెక్కి వెళ్లిపోయాడు.

వాడిని అలా పోనిచ్చి, బతికామురా తండ్రీ అనుకొని, గబగబా దొరికినంత బంగారం, వెండి గిండీ అంతా మూటగట్టుకొని, ఒక పిల్లిని కోసి పొయ్యి మీద వేలాడదీసి, మొర్రిమామ బట్టలు కట్టుకొని, వాడిలాగా వేషం వేసుకొని, గుర్రం ఎక్కి బయలుదేరింది చిన్నకోడలు.

ఆమె యిటువైపు నుంచి బయలుదేరితే వాడు అటువైపు నుంచి మాంసం గీంసం తీసుకుని వస్తున్నాడు.

వాడికి దూరంగా ఈవిడొస్తున్న గుర్రం, గుర్రం మీద మనిషీ కనిపించారు. వాడు అనుమానంగా అటువైపు చూస్తూ -

'ఈ గుల్లం నాది.

ఈ బత్తలు నావి. ఈ బస్తాలు నావి.

మనిషెవలో తెలియడం లేదే' అనుకున్నాడు.

మళ్లీ కొంచెం దూరం వచ్చాడు. ఆమె కూడా గుర్రాన్ని దౌడు తీయిస్తా యింకొంచెం దగ్గరయ్యింది. మళ్లీ కళ్లు చికిలించి చూశాడు. చూసి

-'ఈ గుల్లం నాది.

ఈ బత్తలు నావి. ఈ వేషం నాది

మనిషెవలో తెలియడం లేదే' అనుకున్నాడు.

వాడు అసలే పెళ్లి ఆనందంలో వున్నాడు గదా. అందుకని ఆ ఎవరోలే అనుకొని వాడి కళ్ల ముందు నుంచే చిన్నకోడలు పారిపోతున్నా పట్టించుకోకుండా యింటికి చేరాడు.

చేరేసరికి లోపల నుంచి పిల్లి రక్తం బాండిలిలో పడి చుర్రు చుర్రుమని శబ్దం వస్తా వుంది.

ఒక్కో చుక్క చుర్రుమన్నప్పుడల్లా 'అబ్బో. నా పెల్లాం హప్పులు చేస్తా ఉంది' అని గంతులేస్తున్నాడు. యింకో చుక్క చుర్రుమన్నప్పుడల్లా 'అబ్బో. నా పెల్లాం పప్పులు చేస్తా ఉంది' అని గంతులేస్తున్నాడు.

అలా చేసి చేసి లోపలికెళ్లి చూస్తే ఏముంది తల తెగిన పిల్లి!

ఓసి కంత్రీదానా జారుకున్నావా, అని మళ్లీ గుర్రం తీసుకుని బయలుదేరాడు పట్టుకొద్దామని.

అప్పటికి చిన్నకోడలు గబగబా యిల్లు చేరి, తెచ్చిన నగానట్రా అంతా అత్త ముఖాన కొట్టి 'కానుకల పిచ్చిలో పడి నన్ను తీసుకెళ్లి షైతాను చేతిలో పెడతావా? నువ్వు బిడ్డల్ని కన్న తల్లివా యింకేమైనానా?' అని ఏడ్చింది.

అత్త మనసు కరిగిపోయింది. అందరూ చేరి 'ఏమైంది ఏమైంది' అని అడిగారు.

'యిట్టిట్టా సంగతి. యిప్పుడా మొర్రోడు వస్తాడు. ఏం చేస్తారో చేయండి' అంది చిన్నకోడలు.

అందరూ కలిసి గబగబా యింటి ముందు ఏడు నిలువుల గోతి తవ్వి, దాని మీద పుచ్చుదారాల మంచం వేసి దుప్పటి పరిచి ఏమీ

ఎరగనట్టుగా కూర్చున్నారు. కాసేపటికి డూం డాం అంటూ మొ(ఠిమామ వచ్చాడు.

'ఎక్కల? అమ్మాయి ఎక్కల? యిక్కలకు వచ్చిందా?' అని అడిగాడు.

'అయ్యో రాలేదే. ఎక్కడికి పోయింది. వస్తుందిలేండి. కూర్చోండి' అని మంచం చూపించింది అత్త.

'కూచుంతా. కూచుంతా. అమ్మాయి గనక వస్తే దాని సంగతి చెబుతా' అని మొ(ఠిమామ ముందూ వెనుకా చూసుకోకుండా వెళ్లి పుచ్చుమంచం మీద కూర్చున్నాడు.

అంతే పుటుక్కున మంచం విరిగి ఏడు నిలువుల గోతిలో పడిపోయాడు.

'ఒలమ్మో ఒలి నాయనో నాకు అమ్మాయి వద్దు యింకెవలూ వద్దు బయటికి తీయండి' అని గోల మొదలుపెట్టాడు.

వాడి మాటను ఎవరు నమ్ముతారు? శుద్ధంగా మట్టిపెట్టి వాడిని కప్పెట్టేశారు.

ఆ తర్వాత హాయిగా ఆ బంగారంతో, వెండితో చిన్నకోడలు సంతోషంగా బతికింది.

✪ ఇది మా యిళ్లల్లో పిల్లలకు చాలా యిష్టమైన కథ. మొ(ఠిమామను 'నక్టామామూ' అంటారు. వాడు చెప్పిన 'మనిషెవలో తెలియడం లేదే' అనే మాట మా యిళ్లలో చాలా పాపులర్. ఎవరైనా మనిషి దూరం నుంచి ఆనవాలు తెలియకపోతే 'ఆద్మీ చోన్‌కి మాలుమ్‌నీ' (మనిషెవలో తెలియడం లేదు) అంటుంటారు సరదాగా.